



RNI : APBIL/2023/86665

# రాయల్ జర్నలిజం

ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

గుంటూరు, సంపుటి : 01 సంచిక : 282 | మంగళవారం 19 నవంబర్ 2024 | చీఫ్-ఎడిటర్ : చల్లా శ్రీనివాసరావు | పేజీలు : 8 వెల : రూ.2-00

GUNTUR VOL-01 ISSUE - 282 CHIEF EDITOR : CHALLA SRINIVASA RAO 19 TUESDAY NOVEMBER 2024 PAGES : 8 Rs :2-00


## ముగిసిన ఎన్నికల ప్రచారం.. 1082 కోట్ల విలువైన తాయిలాలు సీజ్

దిల్లీ: మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు ప్రచారం ముగిసింది. ఈ రెండు రాష్ట్రాల్లో అధికారులు భారీగా తాయిలాలను సీజ్ చేశారు.ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేలా పలు రాజకీయ పార్టీలు చేసే ప్రయత్నాలను అడ్డుకొనేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు రూ.1082 కోట్ల విలువైన ఎన్నికల తాయిలాలను సీజ్ చేశాయి. ఈ విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. మహారాష్ట్ర, ఝార?ండ్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఉప ఎన్నికలు జరుగుతున్న స్థానాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా ఇప్పటివరకు మొత్తంగా రూ.1082.2 కోట్ల విలువైన ఎన్నికల తాయిలాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈసీ తెలిపింది. సీజ్ చేసిన దాంట్లో రూ.181.97 కోట్లు నగదు కాగా.. రూ.119.83 కోట్ల విలువ చేసే మద్యం, రూ.123.57 కోట్ల విలువైన మాదకద్రవ్యాలు, రూ.302.08 కోట్ల విలువైన ఆభరణాలు, రూ.354.76 కోట్ల విలువైన ఉచితాలు, ఇతర వస్తువులు ఉన్నట్లు పేర్కొంది. ఈ నెల 20న పోలింగ్ జరగనున్న వేళ రాబోయే రెండు రోజులు గట్టి నిఘా ఉంచనున్నట్లు ఈసీ తెలిపింది.మొత్తంగా రూ.1082.2 కోట్లు సీజ్ చేయగా.. ఇందులో మహారాష్ట్రలో రూ.660.18కోట్లు.. ఝార?ండ్‌లో రూ.198.12కోట్లు, 14 రాష్ట్రాల్లోని ఉప ఎన్నికలు జరుగుతున్న స్థానాల్లో రూ.223.91 కోట్లు ఉన్నట్లు ఈసీ వివరించింది. 2019 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఈసారి సీజ్ చేసిన మొత్తం ఏడు రెట్లు అధికంగా ఉన్నట్లు పేర్కొంది. మహారాష్ట్రలో నవంబర్ 20న ఎన్నికలు జరగనుండగా.. ఝార్ఖండ్‌లో నవంబర్ 20న రెండో విడత పోలింగ్ జరగనుంది. అలాగే, కేరళలోని వయనాడ్ లోక్‌సభ సీటుతో పాటు పలు అసెంబ్లీ స్థానాలకు ఇప్పటికే పోలింగ్ జరగ్గా.. మహారాష్ట్రలోని నాందేడ్




లోక్‌సభ స్థానంతో పాటు కొన్ని అసెంబ్లీ సీట్లకు ఉప ఎన్నికలు నిర్వహించి నవంబర్ 23న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

## ఏడు కీలక బిల్లులకు ఏపీ శాసనసభ ఆమోదం




అమరావతి: ఏపీ పంచాయతీరాజ్ సవరణ బిల్లు-2024, ఏపీ మున్సిపల్ సవరణ బిల్లు-2024, ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ నిరోధక బిల్లు-2024 తదితర ఏడు కీలక బిల్లులకు ఏపీ శాసనసభ ఆమోదం తెలిపింది.ఎంతమంది పిల్లలున్నా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించేలా నిబంధనలు మారుస్తూ తీసుకొచ్చిన బిల్లు సభ ఆమోదం పొందింది.ఎన్టీఆర్ హెల్ వర్సిటీ సవరణ బిల్లు-2024, ఆయుర్వేదిక్ హోమియోపతి మెడికల్ ప్రాక్టిషనర్స్ చట్ట సవరణ, ఏపీ మెడికల్ ప్రాక్టిషనర్స్ రిజిస్ట్రేషన్ చట్ట సవరణ బిల్లు-2024 బిల్లులను శాసనసభ ఆమోదించింది. వీటితోపాటు ఏపీ సహకార సంఘం సవరణ బిల్లు-2024నూ శాసనసభ ఆమోదించింది. అనంతరం స్పీకర్ అయ్యన్న పాత్రుడు శాసనసభను మంగళవారానికి వాయిదా వేశారు.

## 2,3 గంటల్లో శ్రీనివాసుడి దర్శనం ఎలా పూర్తి కావచ్చు?



3 వ పేజీలో

## దిశ చట్టం పనిచేస్తే అఘాయిత్యాలు ఎందుకు పెరిగాయ్?: హోం మంత్రి అనిత



అమరావతి: గతంలో మహిళలపై అత్యాచారాలు జరిగితే జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదని హోం మంత్రి అనిత విమర్శించారు. ఐదో రోజు శాసనమండలి సమావేశాల్లో ఆమె మాట్లాడారు. ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చారు."వైకాపా హయాంలో పరామర్శకు వెళ్లిన మాపైనే కేసులు పెట్టారు. దిశ చట్టం గురించి గొప్పగా చెబుతున్నారు.. అసలు ఆ చట్టం ఉందా? దిశ యాప్, చట్టం పని చేస్తే మహిళలపై అఘాయిత్యాలు ఎందుకు పెరిగాయి. ఉన్న నిర్భయ చట్టాన్ని వదిలేసి.. లేని దిశ చట్టాన్ని తీసుకొచ్చారు. కూటమి ప్రభుత్వ హయాంలో మహిళలపై అసభ్యంగా ప్రవర్తించిన వారిని అరెస్టు చేస్తున్నాం. ముచ్చుమర్రి ఘటనలో బాలికను గుర్తించడానికి సమయం పట్టింది. పోలీసుల వైఫల్యం ఇప్పటిది కాదు.. వైకాపా హయాం నాటిది. కూటమి ప్రభుత్వంలో పోలీసులు 24 నుంచి 48 గంటల్లో నేరస్థుల్ని పట్టుకుంటున్నారు.గత ఐదేళ్లలో పోలీసులు పరదాలు కట్టడానికి, చెట్లు నరకడానికి, రోడ్ల మీద కాపలా కాయడానికి పని చేశారు. ఒక్క మహిళనైనా వారు రక్షించారా? దిశ చట్టానికి చట్టబద్ధత లేకుండా దిశ పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరంలో దిశ పోలీసు స్టేషన్ ప్రారంభించారు. అదే రోజు దళిత మహిళపై సామూహిక అత్యాచారం చేసి పోలీసు స్టేషన్ ముందు వదిలేసి వెళ్లారు.దిశ యాప్‌తో నేరాలు తగ్గింది నిజమైతే..


2 వ పేజీలో

## అతడికి క్షమాభిక్ష ప్రసాదిస్తారా? 2 వారాల్లో తెలియజేయండి: రాష్ట్రపతిని కోరిన సుప్రీం



దిల్లీ: పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్ హత్య కేసులో మరణశిక్ష పడిన బల్వంత్ సింగ్ రాజోనా క్షమాభిక్ష అంశం పై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు వెలువరించింది.అతడి పిటిషన్‌ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దృష్టికి తీసుకెళ్లాలని ఆమె కార్యదర్శిని ఆదేశించింది. దీనిపై రెండు వారాల్లోగా నిర్ణయం తెలియజేయాలని సుప్రీం ధర్మాసనం రాష్ట్రపతిని అభ్యర్థించింది. అనం తరం దీనిపై తదుపరి విచారణను డిసెంబరు 3వ తేదీకి వాయిదా వేసింది. సిక్కులకు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరు తూ జరుగుతున్న ఆందోళనల్లో భాగంగా 1995లో చండీగఢ్ సచివాలయం ముందు జరిగిన పేలుడులో అప్పటి పంజాబ్ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్‌తో పాటు మరో 16 మంది మరణించారు. ఈ పేలుడులో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బల్వంత్ సింగ్ రాజోనా ప్రమేయం ఉన్నట్లు రుజువు కావడంతో 2007లో అతడికి ప్రత్యేక న్యాయస్థానం మరణశిక్ష విధించింది. గత రెండు దశాబ్దాలకు పైగా రాజోనా జైలు శిక్ష అనుభవి స్తున్నాడు.తనకు క్షమాభిక్ష ప్రసాదించాలని కోరుతూ 2012లో రాజోనా కేంద్రాన్ని ఆశ్రయించాడు. అప్పటినుంచి అతడి పిటిషన్ పెండింగ్‌లోనే ఉంది. ఈ క్రమంలోనే తన మరణశిక్షను జీవితఖైదుకు తగ్గించాలని కోరుతూ 2020లో రాజోనా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. మరణశిక్షను జీవితఖైదుగా మార్చలేమని గతేడాది మే నెలలో తేల్చిచెప్పింది. అయితే, అతడి క్షమాభిక్ష పిటిషన్ పై నిర్ణయం తీసుకోవాలని కేంద్ర హోంశాఖను ఆదేశించింది.

## తప్పుడు నివేదికలు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలి: స్పీకర్ అయ్యన్న




అమరావతి: జగనన్న కాలనీల్లో జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు గృహనిర్మాణశాఖపై మాట్లాడారు.తెదేపా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ విశాఖపట్నంలో అక్రమాలు జరిగాయని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.అనంతరం స్పీకర్ అయ్యన్న స్పందిస్తూ అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరపాలన్నారు. అధికారులు ఇచ్చే నివేదికలకు, వాస్తవ పరిస్థితులకు చాలా తేడా ఉంటోందన్నారు. తప్పుడు నివేదికలు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని.. అలా చేస్తే మిగిలిన వారు తప్పులు చేయరన్నారు. ఈ మేరకు మంత్రి పార్థసారథికి స్పీకర్ సూచించారు.

## అరబిందో సంస్థపై చర్యలు తీసుకోండి: సోమిరెడ్డి



అమరావతి: '108' మాటున అరబిందో సంస్థ భారీ అక్రమాలకు పాల్పడిందని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అసెంబ్లీలో ఆధారాలు బయటపెట్టారు.వైకాపా ప్రభుత్వ హయాంలో వైద్యసేవలు అందాల్సిన 18 లక్షల మందికి అంబులెన్స్‌లు అత్యవసర సేవలు అందించలేకపోయాయని మండిపడ్డారు. మొత్తం 34 లక్షల మంది బాధితులకు గానూ 17.8 లక్షల మందికి గోల్డెన్ అవర్ సమయంలో చేరలేకపోయాయని ఆడిట్ జనరల్ తప్పుబట్టిందన్నారు. 61 శాతం అంబులెన్స్‌లో సెలైన్ల కొరత, ఫస్ట్ ఎయిడ్ కిట్ల కొరత ఉన్నట్లు కాగ్ నిర్ధరించిదని గుర్తు చేశారు. విజయసాయి రెడ్డి అల్లుడికి చెందిన అరబిందోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అరబిందో సంస్థ 430 అంబు లెన్స్‌లు నడిపిన ప్పటికీ.. 720 అన్నట్లు చూపించారని నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం హయాంలో అంబులెన్స్‌లకు చట్టాలు వర్తించవా? అని ప్రశ్నించారు. ప్రజల ప్రాణాలతో ఆడుకున్న సంస్థపై గట్టి చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు.సభ్యులు చేసిన ఆరోపణలు నిజమేనని మంత్రి సత్యకుమార్ యాదవ్ సమాధానమిచ్చారు. ఇప్పటివరకు అరబిందోకు రూ.600 కోట్ల చెల్లింపులు జరిగాయని, మరో రూ.800కోట్ల పైచిలుకు చెల్లింపులు చేయాల్సి ఉందని వెల్లడించారు. అంబులెన్స్‌ల విషయంలో నిర్లక్ష్యంతోపాటు దోపిడీ జరిగిందని స్పీకర్ అయ్యన్న పాత్రుడు పేర్కొన్నారు. ఏం చర్యలు తీసుకుంటున్నారో సభకు, ప్రజలకు తెలియాలన్నారు.

## వార్తా సంస్థలకు సోషల్ మీడియా సంస్థలు చెల్లించాల్సిందే: అశ్వినీ వైష్ణవ్



దిల్లీ: తమ వేదికలపై షేరైన, చదివే కంటెంట్‌కు సోషల్ మీడియా సంస్థలు.. సంప్రదాయ వార్తా సంస్థలకు చెల్లింపులు చేయాలని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు.ఆ మొత్తం తగినంతగా, న్యాయబద్ధంగా ఉండాలని ఆకాంక్షించారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా ఆయన దీనిపై మాట్లాడారు. వార్తలు చదివే తీరు రోజురోజుకు మారుతోందని, ఈ క్రమంలోనే సంప్రదాయ వార్తా సంస్థల డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల నుంచి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లకు మారిందని పేర్కొన్నారు. దీనివల్ల వార్తా సంస్థలకు నష్టం వాటిల్లుతోందన్నారు.వార్తల సేకరణ, జర్నలిస్టులకు శిక్షణ, వారికి వేతనాలతో పాటు సంబంధిత కంటెంట్ సదరు మీడియా సంస్థ బాధ్యత వహించడం వంటి వాటికి పెద్ద మొత్తంలో డబ్బు, సమయం ఖర్చవుతోందని మంత్రి పేర్కొన్నారు. ఈవిషయంలో సంప్రదాయ మీడియాతో పోలిస్తే సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌లకయ్యే ఖర్చు తక్కువన్నారు. అంతేకాదు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో నకిలీ వార్తలు, తప్పుడు సమాచారానికి ఆస్కారం ఎక్కువ అని, దీనిపై చర్చ జరగాల్సి ఉందన్నారు. సామాజిక మాధ్యమాల్లో షేర్ అయ్యే సమాచారం కొన్నిసార్లు అల్లర్లు, సమాజంలో శాంతికి విఘాతం కల్పించిన ఉదంతాలూ ఉన్నాయంటూ ఆందోళన వ్యక్తంచేశారు. అయితే, సదరు కంటెంట్‌కు సామాజిక మాధ్యమాలు బాధ్యత వహించడం లేదన్నారు. ఇలాంటి వాటిపై అప్రమత్తత అవసరం అన్నారు. అయినా, సంప్రదాయ మీడియాలానే సామాజిక మాధ్యమాలూ ఎందుకు బాధ్యత వహించకూడదు? అని ప్రశ్నించారు. వినియోగదారులపై ప్రభావం చూపేలా కంటెంట్‌ను సోషల్‌మీడియా అల్గారిథమ్ చూపించడంపై ఆందోళన వ్యక్తంచేశారు.

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక
ROYAL JOURNALISM

# ఎడిటోరియల్

## సందిగ్ధ జ్ఞానం

జ్ఞానానికి, అజ్ఞానానికి మధ్య ఉన్నది 'అ'భేదమే కదా అనుకుంటాం కానీ, ఆ రెండింటికీ మధ్య ఏడు సముద్రాలంత దూరం ఉంది. అజ్ఞానమనే చీకటి ఒడ్డు నుంచి, జిజ్ఞాస అనే అలల మీదుగా, జ్ఞానమనే వెలుగుల తీరం వైపు సాగే ప్రయాణంలో ఆనందమే మనకు తెప్పవుతుంది.అందుకే జ్ఞానానందమనే మాట పుట్టింది. అయితే, ఆ ఆనందాన్ని అంటిపెట్టుకుని ఒక విషాదమూ ఉంటుంది.అది ఏమిటంటే... మన ఊహకు అందనంత వయసున్న ఈ అనంతవిశ్వంలో భూమి ఒక గోళీకాయ కన్నా కూడా చిన్నదనుకుంటే, దానిపై జీవించే మనిషి నలుసుపాటి కూడా చేయడు. అతని అస్తిత్వాన్ని కాలం కొలమానంతో కొలిస్తే అది కొన్ని క్షణాలను మించదు. కనుక అనంతవిశ్వం గురించిన జ్ఞానం సంగతలా ఉంచి, ఈ భూమి గురించి, ఈ భూమి మీద తన మనుగడ గురించిన జ్ఞానం మొత్తాన్నే ఒక మనిషి తన జీవితకాలంలో సంగ్రహించుకోవడం అసాధ్యం. అదీ అసలు విషాదం.మనిషిలో మెదడు ఎప్పుడు వికసించిందో అప్పుడే అతనిలో విశ్వం గురించిన జ్ఞానాన్వేషణ మొదలై, వేలసంవత్సరాలుగా కొనసాగుతూనే ఉంది. చంద్రుడి వృద్ధి, క్షయాలను అనుసరించి కాలగణనాన్నీ, ఋతుభ్రమణాన్ని అనుసరించి వేటజంతువుల గుర్తింపునూ మనిషి ప్రారంభించి వాటిని ఒక పొడవాటి ఎముకపై నమోదు చేయడం నక్షత్రాలు, రాశులతో ముడిపడిన జ్యోతిర్విజ్ఞానానికి నాంది అయిందంటారు. ఆపైన మొక్కల సేకరణ నుంచి, పెరటిసాగుకుబీ అక్కడి నుంచి వ్యవసాయానికి సాగే క్రమంలో ఆహారవిజ్ఞానాన్ని బహుముఖాలుగా విస్తరించుకుంటూ వెళ్ళాడు.రాతిపనిముట్ల తయారీలో సాంకేతికజ్ఞానాన్ని, ఏదో అతీతశక్తి ఈ విశ్వాన్ని సృష్టించి నడిపిస్తోందన్న ఊహ నుంచి మత, ఆధ్యాత్మిక విజ్ఞానాన్నిబీ నియమ నిబంధనలు, కట్టుబాట్లతో కలసి జీవించడం నుంచి సంస్కృతిని సంతరిస్తూ, నిర్మిస్తూ వచ్చాడు. ఇందులో ప్రతిదీ జ్ఞానాన్వేషణలో మేలి మలుపేబీ జ్ఞానపు నిచ్చెన నధిరోహించడంలో నిశ్చయాత్మకమైన మెట్టే. నగరాల నిర్మాణం మీదుగా నాగరికతాదిశగా సాగిన ఈ యాత్రలో ఇంతవరకు మనిషి ఎక్కడా మడమ తిప్పింది లేదుబీ ఆకాశమే హద్దుగా ఆ యాత్ర ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. అయినా సరే, సంపూర్ణజ్ఞానం మనిషికి ఎప్పటికీ అందని ఎండమావిలా ఊరిస్తూనే ఉంది. కనిపించని జ్ఞానచంద్రుడి చీకటిపార్శ్వం అదే.సంకేతాల నుంచి లిపిని అభివృద్ధి చేసుకుని జ్ఞానాన్ని పుస్తక రూపంలో భద్రపరచడం ఈ క్రమంలో మరొక మెరుపుల మజిలీ. మొదట్లో విశ్వసృష్టి, దేవుడు, మతం, ఆధ్యాత్మికత, శాస్త్ర విజ్ఞానం, సాంకేతికజ్ఞానం వగైరా వింగడింపు లేకుండా తనకు తెలిసిన జ్ఞానం మొత్తాన్ని, తనకు తెలిసిన ప్రక్రియలో ఒకేచోట రాశిపోసిన ఉత్సాహం మనిషిది. అందుకే గణితశాస్త్రాన్ని కూడా పద్యాల్లో చెప్పిన పావులూరి మల్లన్నలు మన దేశంలో, మన సాహిత్యంలో కనిపిస్తారు.తర్వాత తర్వాత జ్ఞానం అనేక శాఖలు గల మహావృక్షంగా ఎదిగిపోయి, ఒక మనిషి తన జీవితకాలంలో ఏ ఒక్క శాఖనూ పూర్తిగా తేరి చూసే వీలుకుండా నిలువుగా అడ్డంగా విస్తరించిపోయింది. తన కళ్ళ ముందే ఉన్న, తన నిత్యజీవనంతో ముడిపడి ఉన్న, తన అనుభవంలోకి వచ్చే అనేక విషయాల ఆనుపానులు తెలియకుండానే మనిషి తన జీవితకాలాన్ని ముగించవలసి రావడం కన్నా పెనువిషాదం ఇంక ఏముంటుంది?ప్రసిద్ధ కథారచయిత పెద్దిభొట్ల సుబ్బరామయ్య 'ఇంగువ' అనే కథలో ఈ విషాదాన్నే ఒకింత హాస్యగంభీరస్ఫోరకంగా చిత్రిస్తారు. అందులో రాజశేఖరం అనే వ్యక్తిని ఇంగువ ఎలా తయారవుతుందనే ప్రశ్న చిరకాలంగా వేధిస్తూ ఉంటుంది. అతను వృద్ధాప్యంలో మంచం పడతాడు. ఒక మిత్రుడు అతణ్ణి చూడడానికి వెడతాడు. రాజశేఖరం అతి కష్టం మీద నోరు తెరచి అదే ప్రశ్న అడుగుతాడు. దానికి సమాధానం తెలుసుకోకుండానే జీవితం చాలిస్తానేమోనన్న బెంగ అతని ముఖంలో కనిపిస్తుంది.మిత్రుడు వెంటనే వెళ్ళి ఇంకో మిత్రుని కలసి సమాధానం కనుక్కొని తిరిగి వస్తాడు. కానీ అప్పటికే రాజశేఖరం కన్నుమూస్తాడు. ఇప్పటిలా ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చి, గూగుల్ శోధించి ఉంటే, 'ఫెరులా' అనే మొక్క నుంచి పుట్టే జిగురే గట్టిపడి ఇంగువగా తయారవుతుందనీ, 'అసాఫోటిడా' అనేది దాని శాస్త్రీయ నామమనీ, ఈ మొక్క ఎక్కువగా ఇరాన్ ఎడారుల్లో, అఫ్ఘానిస్తాన్, ఉజ్బెకిస్తాన్ పర్వతప్రాంతాలలో సాగవుతుందనీ రాజశేఖరం తెలుసుకుని ఉండేవాడు.అలాగని అతనికా అదృష్టం లేకపోయిందనడానికీ వీల్లేదు. ఇంటర్నెట్ ఆధారిత బహుళ మాధ్యమాలతో సమాచారవిప్లవం కొత్తపుంతలు తొక్కిందనుకునే ఈ రోజున కూడా చిన్న చిన్న సందేహాలు తీరకుండానే దేహం చాలించే రాజశేఖరాలు ఉంటూనే ఉన్నారు. జ్ఞానతీరానికి ఏ కొంచెమైనా దగ్గరవడానికి ఏ అత్యాధునిక సాధనాలూ సాయపడడం లేదు. పరిమిత జీవితకాలం అతని నిస్సహాయతను ఇప్పటికీ గుర్తుచేసి వెక్కిరిస్తూనే ఉంది.మరోవైపు సమాచార ఉల్బణం నుంచి నిక్కమైన సమాచారానికి బదులు అసత్యాలు, అర్ధసత్యాలు, వక్రీకరణలు పుట్టుకొచ్చి జ్ఞానాన్వేషణను అజ్ఞానాన్వేషణగా మార్చివేశాయి. అలా వ్యాప్తిలోకి వచ్చినదే 'ఫేక్' లేదా నకిలీ సమాచారమనే మాట. నేటి రాజశేఖరాలను వేధిస్తున్నది కేవలం సమాచార రాహిత్యం కాదు, నిజమో, అబద్ధమో తెలియని సమాచార సందిగ్ధం. జ్ఞాన, అజ్ఞానాల మధ్య ఆ మాత్రపు అక్షరభేదాన్ని కూడా తుడిచేసి పూర్తి అభేదాన్ని స్థాపించే యుగంలో ఉన్నాం. అదీ విషాదం!

## ప్రధానోపాధ్యాయులకు జిల్లా కేంద్రంలోనే శిక్షణ ఇవ్వాలి



రాయల్ జర్నలిజం, రాయచోటి నవంబర్ 18,ప్రధానోపాధ్యాయులకు అందించే లీడర్షిప్ ట్రైనింగ్ లను జిల్లా కేంద్రంలోనే నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం కు ఉపాధ్యాయ సంఘాలు వినతి పత్రాన్ని అందించారు. ఇటీవల పశ్చిమగోదావరిలో లీడర్షిప్ ట్రైనింగ్ లో ఒక ప్రధానోపాధ్యాయుడు గుండెపోటుతో మరణించడం జరిగిందని, మరొకరు ఐసీయూ లో అడ్మిట్ అయ్యారని ఆ సంఘటనలతో మన రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఇకపైన లీడర్షిప్ ట్రైనింగ్ లన్ని జిల్లాల వారీగా జరుపుతామని హామీ ఇవ్వడం జరిగిందని ఆ వినతి పత్రంలో ఉపాధ్యాయ సంఘాలు పేర్కొన్నాయి. ఒకవేళ జిల్లా దాటి వెళ్ళవలసి వస్తే 100 కిలోమీటర్ల దూరం దాటకుండా చూస్తామని, శిక్షణను నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహిస్తామని చెప్పడం జరిగిందని వినతిపత్రంలో విన్నవించారు. బలవంతపు శిక్షణల వలన ప్రధానోపాధ్యాయులు మరణిస్తున్నప్పటికీ ఇంతకు ముందు మాదిరే తిరిగి శిక్షణ ఇస్తామనం చెప్పడం దురదృష్టకరమన్నారు. అన్నమయ్య జిల్లాలోని రాయచోటి మరియు మదనపల్లి డివిజన్ ప్రధానోపాధ్యాయులకు ఈనెల 18వ తేదీ నుండి అనంతపురంలోని సెంటర్లోనే ట్రైనింగ్ కి హాజరు కావాలని చెబుతున్నారన్నారు. అన్నమయ్య జిల్లాలోని ఏ ఒక్క పాఠశాల కూడా అనంతపురంలో జరిగే ట్రైనింగ్ సెంటర్ కి వంద కిలోమీటర్ల లోపల లేనందువలన అన్నమయ్య జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు అందరికీ లీడర్షిప్ ట్రైనింగ్ ను అన్నమయ్య జిల్లాలోనే ఏర్పాటు చేయవలసిందిగా మనవి చేస్తున్నామన్నారు. ఈ విషయమై తగు చర్యలు తీసుకొనవలసిందిగా కోరుచున్నామని విన్నవించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర బాధ్యులు కొండూరు శ్రీనివాసరాజు, ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మడితాటి నరసింహారెడ్డి,రామకృష్ణ, జె వెంకట్రాంరెడ్డి, ఎస్టియు జిల్లా అధ్యక్షులు శివారెడ్డి, రామకృష్ణ, ఏపీటీఎఫ్ 257 జిల్లా అధ్యక్షులు అబ్బవరం హరిబాబు, అపస్ జిల్లా అధ్యక్షులు నరసింహులు, ఉపాధ్యాయులు కులశేఖర్ రెడ్డి, బచ్చల శ్రీనివాసులు, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు సదాశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దిశ చట్టం పనిచేస్తే అఘాయిత్యాలు ఎందుకు పెరిగాయ్?: హోం మంత్రి అనిత

(మొదటి పేజీ తరువాయి)

రికార్డుల్లో ఎందుకు నేరాలు పెరుగుతున్నాయి. అమరావతిలో ఫోరెన్సిక్ ల్యాబ్ కట్టడానికి వైకాపా హయాంలో కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అది పూర్తయి ఉంటే నేరాలు జరిగిన వెంటనే శిక్షలు పడేందుకు అవకాశం ఉండేది.

**మహిళల భద్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట**

2014-19 మధ్య ఏపీలో 83,202 కేసులు నమోదయ్యాయి. 2019-24 మధ్య 1,00,508 కేసులు నమోదయ్యాయి. గడిచిన ఐదేళ్లలో మహిళలపై అఘాయిత్యాలు 20.8 శాతం పెరిగాయి. గత ప్రభుత్వం దిశ చట్టాన్ని తెచ్చి అమలు చేయడంలో విఫలమైంది. జగన్ పాలనలో అనేక అఘాయిత్యాలు జరిగినా కనీస చర్యల్లేవు. మహిళా పోలీసు స్టేషన్ల బోర్డులను దిశ పీఎస్‌లుగా మార్చారు. గంజాయి నియంత్రణపై జగన్ ఒక్కసారి కూడా సమీక్షించలేదు. మహిళల భద్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసింది. ప్రత్యేక కోర్టులతో నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చేస్తున్నాం. జగన్ తల్లి, చెల్లికి అన్యాయం జరిగినా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. మహిళల జోలికొచ్చినా, సోషల్‌మీడియాలో అసభ్యకరంగా మాట్లాడినా కఠిన చర్యలు తీసుకుంటాం. మహిళా పీఎస్‌లు, హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసి నివారణ చర్యలు తీసుకుంటున్నాం. 5 నెలల కాలంలో 24 గంటల్లోనే నిందితులను పట్టుకుని రిమాండ్‌కు పంపించాం. మహిళలపై అఘాయిత్యాలు జరగకుండా కఠిన చట్టాలు, ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేస్తాం" అని అనిత అన్నారు.

## రోడ్ల నిర్మాణం పూర్తి స్థాయిలో చేయాలి



రామసముద్రం. నవంబర్ 18 రాయల్ జర్నలిజం.మండల స్థాయిలో సి సి రోడ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలనీ టిడిపి మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ గౌడ్ తెలియజేశాడు. ఎన్నో సంవత్సరాల నుండి రోడ్లు కాలువలు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్న ప్రజలు పల్లె పండుగలో భాగంగా రోడ్ల నిర్మాణం చేపట్టినందుకు ఎమ్మెల్యే గారికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. తగు రీతిలో నిర్మాణం చేపట్టాలని బలజ వీధి నుండి మసీదు వరకు సీసీ రోడ్డును అభివృద్ధి చేసే పనులు శరవేగంగా సాగుతున్నాయి.కొన్నేళ్ళుగా వర్షాకాలంలో ఈ ప్రాంతంలో రోజుల తరబడి నీరు నిలిచి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్థానిక ఎమ్మెల్యే సమస్య పరిష్కారంపై దృష్టి సారించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ భూక్యా మునుస్వామి నాయక్,పి ఆర్ ఏ ఈ వెంకటరమణ, ఇంజనీర్ అసిస్టెంట్ సరస్వతి పాల్గొన్నారు



## 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా



రాయల్ జర్నలిజం లక్కిరెడ్డిపల్లె నవంబర్ 18( అన్నమయ్య జిల్లా): 18.11. 2024 న శాఖా గ్రంథాలయం లక్కిరెడ్డి పల్లి వారి ఆధ్వర్యంలో మనీషా హైస్కూల్ లక్కీరెడ్డిపల్లి వారి ఆధ్వర్యంలో వక్తృత్వ పోటీలు మరియు వ్యాసరచన పోటీలు స్కూల్ నందు నిర్వహించడం జరిగినది , ఇందులో 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు, గ్రంథాలయ అధికారి సి ఉదయ్ కుమార్ తెలియజేశారు అలాగే ప్రతి ఒక్కరు గ్రంథాలయాన్ని ఉపయోగించు కోవాలి అని కోరారు.

## కార్తీక సోమవారం శివాలయాలకు భక్తులు రద్దీ..



రామసముద్రం,నవంబర్ 18 రాయల్ జర్నలిజం.: అన్నమయ్య జిల్లా రామసముద్రం మండల పరిధిలోని పలు గ్రామలలోమూడవ కార్తీక సోమవారం పండుగను వైభవంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా వేకువ జామునుండి కార్తీక సోమవారం నోముల సంబరాలు మొదలయ్యాయి. చిన్నపిల్లలు నుండి పెద్దలు వరకు బాణసంచాలు కాల్చడంలో నిమగ్నమయ్యారు. ఉదయమే తలస్నానం చేసి, కొత్త వస్త్రాలు ధరించి ఆనందోత్సహాలతో కార్తీక సోమవారం నోములు పండుగ జరుపుకున్నారు. మండల కేంద్రంలోని బజారు వీధులోవెలిసిన శ్రీ వాళీశ్వర స్వామి ఆలయం, దిగువపేటనందు గల శ్రీ చంద్రశేఖరస్వామి ఆలయం, చెంబకూరు కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, మూగవాడి పుండరీశ్వర ఆలయం, బలసముద్రంలో వాళీశ్వర స్వామి దేవాలయాల్లో కార్తీకసోమవారాల నోములు ఆలయ అర్చకులు బాలస్వామి, తిన్నిలిస్వామి,అనిల్ స్వామి శివపార్వతులను పుష్పలతో అలంకరణచేసి అభిషేకాలు,కుంకుమా ర్చనలు నిర్వహించి భక్తులకు దర్శన బాగ్యంకల్పించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసారు.పలు శివాలాయాల్లో అర్చకులు కేదారీశ్వర వ్రతం కథ క్లుప్తంగా భక్తులకు వివరించారు.కథ విన్న భక్తులు పరవశించారు. శివ పార్వతిదేవి దర్శనం కల్పించి వీరికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## నూతన పోలీసు భవనాలకు కృషి చేయాలి



రాయల్ జర్నలిజం, రాయచోటి, నవంబర్,18 రాయచోటి రూరల్ పరిధిలో నూతన పోలీస్ భవనం నిర్మాణానికి కృషి చేయాలని రాష్ట్ర హోం,విపత్తుల శాఖ మంత్రి అనిత గారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి కోరారు. పోలీస్ సిబ్బంది సేవలు సరైన సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారని, వారి సేవలో ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం వారికి తగిన సహకారం అందించాలనీ మంత్రి తెలిపారు. సోమవారం రోజు సచివాలయంలో హోం మంత్రి కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత గారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా యవజన క్రీడా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు మర్యాదపూర్వకంగా కలిసి అన్నమయ్య జిల్లా కేంద్రంగా డీఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేయడంతో పాటు పోలీస్ సిబ్బందికి పోలీస్ క్వాటర్స్ ఏర్పాటుచేసి వారికి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని హోం మంత్రిని కోరారు..ఈ సందర్భంగా.. హోంమంత్రి డి.ఎస్.పి కార్యాలయం, పోలీస్ క్వార్టర్స్ నిర్మాణానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## కొందరి పేరెంట్స్ కంప్లైంట్ మేరకు



రాయల్ జర్నలిజం లక్కిరెడ్డిపల్లె నవంబర్17( అన్నమయ్య జిల్లా): ఏపీ మోడల్ స్కూల్ నందు పిల్లలకు పెట్టే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం ఎలా ఉంది అని ఎస్ఎంసి చైర్మన్ యనమల మనీ టిడిపి ప్రచార కార్యదర్శి యనమల విశ్వనాథ్ భోజనం తిని చూసి బాగుంది రోజు పిల్లలకు ఇలాగే భోజనం తయారు చేసి ఇవ్వాలని పిల్లలు భోజనం బాగా లేదన్న పేరెంట్స్ తల్లిదండ్రులు మాకు కంప్లైంట్ చేసిన తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం జరిగింది

## అయ్యప్ప మాలధారణ భక్తులకు అన్నదానం



లక్కిరెడ్డిపల్లి రాయల్ జర్నలిజం నవంబర్17( అన్నమయ్య జిల్లా ): మండలంలోని రామాపురం రోడ్డు మార్గంలో నామాల గుట్టపై వలసిన శ్రీ శ్రీ అయ్యప్ప స్వామి, శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ సన్నిధిలో దాతలు రాయచోటికి చెందిన సంగరాజు సుబ్బరామరాజు, రాజేష్ కుమార్ రాజు లు సోమవారం అయ్యప్ప మాలాదరణ భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గురు స్వాములు వెంకటేష్, గంగరాజు, గంగాధర్ రాజు, సుధీర్ కుమార్, బుజ్జి, గంగరాజ , గంగయ్య లు స్వామి వారికి పూజలు నిర్వహింపజేసి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అయ్యప్ప మాలధారణ భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేయడం సంతోష దాయకమున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అయ్యప్ప మాలదన్న భక్తులు స్థానిక ప్రజలు, అయ్యప్ప ఆలయ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవలో రెడ్ క్రాస్ సంస్థ ప్రథమ శ్రేణిలో ఉంటుంది: జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి



రాయల్ జర్నలిజం (బాపట్ల) నవంబర్ 18: రెడ్ క్రాస్ సంస్థ సేవలు శ్లాగనీయమని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు. రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో విదేశాల నుంచి దిగుమతి అయిన విలువైన బ్లాంకెట్స్, పౌష్టికాహార కిట్లను 25 మంది గర్భిణులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా స్థానిక కలెక్టరేట్లో సోమవారం ఉచితంగా పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులలోనే గర్భిణులకు కాన్పులు జరగాలని కలెక్టర్ చెప్పారు. ప్రశాంతమైన వాతావరణంలో గర్భిణులు ఉండాలని, సురక్షితంగా కాన్పు జరగాలని ఆయన ఆకాంక్షించారు. గర్భిణులకు ప్రతినెల క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు జరగాలన్నారు. నవ సమాజ నిర్మాణంలో భాగంగా గర్భిణులకు మెరుగైన వైద్యం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. వారి కాన్పుల సమయంలో ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో కాన్పు జరిగితే రూ.6,000లు గర్భిణీకి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. కాన్పు తర్వాత తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ లో వారిని సురక్షితంగా ఇంటికి చేర్చే బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. గర్భిణీలు నిరంతరం వైద్యుల పర్యవేక్షణలో ఉండాలన్నారు. నిర్లిప్తత ఉండరాదని, ప్రాణంతో చెలగాటం ఆడరాదన్నారు. జన్మనిచ్చిన తల్లితోపాటు శిశువుకు టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. సమాజానికి సేవలందించే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లులపై ఉందన్నారు. మీరంతా క్షేమంగా ఉండాలని ఆయన కోరారు. రెడ్ క్రాస్ సంస్థ ద్వారా నారాయణ భట్టు బాపట్ల జిల్లాలో అందిస్తున్న సేవలు మారువలేనివని ప్రశంసించారు. గ్రీవెన్స్ సెల్ కు వచ్చే అర్జీదారులకు ప్రతి సోమవారం ఉచితంగా పెట్టడం అభినందనీయం అన్నారు. సామాజిక సేవలో దాతల సహాయం తీసుకుని వారు చేస్తున్న కృషిని ప్రతి ఒక్కరు అభినందించాలన్నారు. రెడ్ క్రాస్ సేవలు మానవత్వం పరిమలించేలా ఉన్నాయని జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్ తెలిపారు. గ్రీవెన్స్ సెల్ కు వచ్చే వారందరికీ ఉచితంగా భోజనం అందించడం అభినందనీయమన్నారు. ఎవరు సమస్యలతో వచ్చిన అవన్నీ తనవిగా భావిస్తూ జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తక్షణమే పరిష్కారానికి విశేష కృషి చేస్తున్నారని వివరించారు. కలెక్టరేట్ వద్ద మంచినీటి బోరు ఏర్పాటు చేయడం సంతోషిదాయకమన్నారు. గర్భిణీలు నిరంతరం వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ చెప్పారు. ప్రతి ఒక్కరు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. కాన్పుల సమయంలో ఆరోగ్యంగా ఉండేలా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. శిశువులు జన్మించిన తదుపరి



గ్రోత్ మానిటరింగ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. గర్భిణీలు ఆరోగ్యంగా ఉండి నవజాత శిశువుల జననానికి కృషి చేయాలని రెడ్ క్రాస్ సంస్థ కార్యదర్శి నారాయణ భట్టు తెలిపారు. గర్భిణీలు క్షేమంగా ఉంటే జన్మించే శిశువులు ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. చలికాలంలో గర్భిణులకు ఎలాంటి అనారోగ్యం రాకుండా రెడ్ క్రాస్ సంస్థ ఎంతో విలువైన బ్లాంకెట్స్ అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రులలోనే కాన్పులు జరిగేలా అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఆర్డిఓ పి గ్లోరియా, వైద్య అధికారులు, రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# జనాలపై విరుచుకు పడుతున్న వీధి గ్రామ సింహాలు



రామసముద్రం, నవంబర్18 రాయల్ జర్నలిజం: రామసముద్రం మండలం చెంబకూరు గ్రామానికి చెందిన భారతమ్మ(60) అనే మహిళకు కుక్కల గుంపు కొట్లాడుకొని ఆమె మీద పడడంతో కిందపద్ద ఆమెకు గాయాలు అవ్వడంతో వైద్యం నిమిత్తం ఆమెను మదనపల్లి హాస్పిటల్ కి తీసుకువెళ్లడం జరిగింది. ఈ విషయం పై ఎన్నిసార్లు అధికారులకు పత్రికల ద్వారా చెప్పిన ప్రయోజనం లేకపోతొందని, తక్షణమే ఈ విషయం పై ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకొని కుక్కల బారి నుండి ప్రజలను కాపాడే విధంగా తగు చర్యలు తీసుకోవాలని జనసేన రామసముద్రం మండల అధ్యక్షులు హొసూరు చంద్రశేఖర్ కోరడం జరిగింది.

# తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం...

## మీడియాను హెచ్చరించిన బాపట్ల డిఎస్పి రామాంజనేయులు...



రాయల్ జర్నలిజం (బాపట్ల) నవంబర్ 18 : పట్టణంలో 11 సంవత్సరాల బాలికపై అత్యాచారం జరిగినట్లు మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని తప్పుడు ప్రచారమని బాపట్ల డిఎస్పి రామాంజనేయులు ఖండించారు. ఘటనకు సంబంధించిన వాస్తవాలను గురువారం బాపట్ల డిఎస్పి కార్యాలయంలో వివరించారు. స్థానిక 11వ వార్డు రాజీవ్ నగర్ కాలనీకి చెందిన బడుగు నాగేశ్వరరావు (60) అనే వ్యక్తి 11 ఏళ్ల బాలిక పట్ల అనుచితంగా ప్రవర్తించిన ఘటన పై బాపట్ల పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం కేసు విచారణ జరుగుతోందని, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవడానికి పోలీస్ శాఖ కట్టుబడి ఉందన్నారు. కొంతమంది వ్యక్తులు సమూహాలు, భయాందోళనలు సృష్టించడానికి సంఘటనను సంచలనం చేయాలనే ఉద్దేశ్యంతో, బాధ్యతారహితంగా బాలిక పట్ల అనుచితంగా ప్రవర్తించిన ఘటనను అత్యాచారంగా ఆరోపిస్తూ తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారన్నారు. ఇటువంటి చర్యలు నిర్లక్ష్యమే కాకుండా చట్టవిరుద్ధం మాత్రమే కాకుండా ప్రజా శాంతికి భంగం కలిగించడానికి మాత్రమే ఉపయోగపడతాయాన్నారు. ముఖ్యంగా మహిళలు, మైనర్లకు సంబంధించిన ధృవీకరించబడని (లేదా) తప్పుదారి పట్టించే సమాచారాన్ని ఎవరైనా ప్రసారం చేస్తే తీవ్రమైన, చట్టపరమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. తప్పుడు ప్రచారాలను సహించబోమన్నారు.

# డిబిఎన్ పల్లి ప్రాథమిక పాఠశాలలో అతిధి భోజనం



రాయల్ జర్నలిజం (రాజంపేట) నవంబర్ 18 : రాజంపేటలోని డిబిఎన్ పల్లి ప్రాథమిక పాఠశాల నందు నేడు విద్యార్థిని విద్యార్థులకు పాఠశాలలో పనిచేస్తున్నటువంటి స్వర్ణలత మేడం విద్యార్థులకు అతిధి భోజనం ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజియన్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పోతు గుంట రమేష్ నాయుడు మరియు రిటైర్డ్ ఎంఈఓ నిర్మల విచ్చేసి విద్యార్థిని విద్యార్థులకు త్రిభుజం అందించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులకు మీ ఇళ్లల్లో జరిగే శుభకార్యాలు లేదా మీ పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు అతిథి భోజనం ఏర్పాటు చేయడం మంచి కార్యక్రమం అని కావున సమాజంలో ఉన్న సేవా తత్పరులు అందరు కూడా ఇటువంటి కార్యక్రమం చేయాలని పిల్లలు వృద్దులేకి రావాలని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులే ధైర్యంగా సమస్యలను ఎదుర్కోగలిగిన శక్తి విద్యాబుద్ధులు ఎక్కువగా ఉంటాయని ఈ సందర్భంగా వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బయ్య ఉపాధ్యాయులు చంద్రారెడ్డి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# ప్రతి నెల మూడు, నాల్గవ శుక్రవారాల్లో దివ్యాంగులు, ఎస్టీల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ సెల్




రాయల్ జర్నలిజం (బాపట్ల) నవంబర్ 18: దివ్యాంగులు, ఎస్టీల సమస్యల పరిష్కారానికి ప్రతినెల మూడు, నాల్గవ శుక్రవారాల్లో ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సోమవారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు వినతి పత్రాల ద్వారా కలెక్టర్ కు తమ సమస్యలు విన్నవించారు. తన పరిధిలోని వాటికి ఆయన తక్షణమే పరిష్కార మార్గం చూపారు. దివ్యాంగులు క్యూలో నిలబడి ఇబ్బందులు పడకుండా వారి కొరకు ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తామన్నారు. ప్రతి నెల మూడో శుక్రవారం ఉదయం 10:30 గంటలకు కలెక్టరేట్లో గ్రీవెన్స్ ప్రారంభమవుతుందన్నారు. అలాగే ప్రతి నెల నాల్గవ శుక్రవారం కేవలం ఎస్టీల కొరకు మాత్రమే గ్రీవెన్స్ నిర్వహిస్తామని ప్రకటించారు. దివ్యాంగులు, గిరిజనుల సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లా అధికారులంతా హాజరు కావాలన్నారు. అదే రోజు మండల స్థాయి, డివిజన్ స్థాయి అధికారులంతా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అందుబాటులో ఉండాలన్నారు. ప్రతి నెల రెండు రోజులు కేవలం దివ్యాంగులు, ఎస్టీల సమస్యల పరిష్కారానికి సమయం కేటాయిస్తామన్నారు. ఈ విషయాలను మండల, గ్రామస్థాయిలో ప్రకటన చేయాలన్నారు. దివ్యాంగులు, ఎస్టీలకు సమాచారం అందించి సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజా సమస్యలను సాధ్యమైనంత వరకు అధికారులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్ లో మాదిరిగానే ప్రతి సోమవారం డివిజన్, మండల స్థాయిలో, మునిసిపాలిటీ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతుందన్నారు. అధికారులంతా ఈ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించాలన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. గడువు తీరకముందే అర్జీదారులకు పరిష్కార మార్గం చూపాలన్నారు. కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం వంటివి అధికారులు చేయరాదన్నారు. ఆధార్ కార్డులు లేని ఎస్టీల సర్వే మరింత పక్కాగా నిర్వహించాలన్నారు. ఆధార్ కార్డు పొందిన తర్వాత ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వారికి వర్తింప చేయాలన్నారు. చీరాల మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద తోపుడుబండ్లపై వ్యాపారం నిర్వహించుకుంటున్న నక్కల జాతి 18 కుటుంబాల వారు కలెక్టర్ కలిసి వినతి పత్రం సమర్పించారు. వారి జీవనోపాధికి ఆటంకం కలిగించకుండా, రాత్రి సమయాలలో నిద్రించడానికి ఆశ్రయం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, ఆర్డీవో పి గ్లోరియా, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వెన్నెల కంటి నగర్‌కు పెను ప్రమాదం పొంచి ఉంది మా ప్రభో....



రాయల్ జర్నలిజం (బాపట్ల) నవంబర్ 18: స్తానిక వెన్నెలకంటి నగర్ లో నివాసముంటున్న ఎస్టీ ప్రాణాలకు పెను ముప్పు ఉ0దని, అధికారులు వెంటనే స్పందించాలని డి బి ఆర్ సి సిటీ కోఆర్డినేటర్ శ్రీలత అన్నారు. సోమావారం జిల్లా కలక్టరేట్ లో జరిగిన గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ స్థానిక వెన్నెల కంటి నగర్ లో నివసిస్తున్న ఎస్టీ యానాదులు 60 కుటుంబాలు చేపల వేట మరియు వ్యవసాయ కూలీలుగా జవనం సాగిస్తున్నారని, వీరు నివసిస్తున్నవీధుల్లో కరెంటు స్తంభాలు పైన విరిగి నేలకు ఒరగటానికి సిద్ధంగా ఉన్నవి చిన్న వర్షం కానీ గాలి కానీ వచ్చిన స్తంభాలు విరిగి ప్రాణాపాయం జరిగే పరిస్థితి ఉన్నదని, అదేవిదంగా గత నెల సెప్టెంబర్ లో కురిసిన వర్షాలకు వర్షపు నీరు పోవడం లేదని, రోడ్లు పగలకొట్టి తూములు ఏర్పాటు చేస్తామని రోడ్లు పగల కొట్టి ఇప్పటికీ కూడా రోడ్లు మరమ్మత్తు చేయలేదని, ఒకటే దారి ఉండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతు0దని, వెంటనే అధికారులు స్పందించి ఎస్టీ యానాదుల కుటుంబాలకు తగు న్యాయం చేయవల సినదిగా కోరుతూ నేడు కలెక్టర్ కు వినతిపత్రం అందించడం జరిగి0దని డి. బి.ఆర్.సిసిటీ కోఆర్డినేటర్ శ్రీలత తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు అలాగే డి.బి.ఆర్.సి డివిజనల్




కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, చీరాల ఏరియా కోఆర్డినేటర్ భగవాన్దాస్ మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

# 2,3 గంటల్లో శ్రీనివాసుడి దర్శనం ఎలా పూర్తి కావచ్చు?

## 'కంకణం' తిరిగి ప్రవేశపెడతారా?

అమరావతి: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమలేశుని దర్శనార్థం నిత్యం వేలాదిమంది భక్తులు వస్తుంటారు.ఇందు కోసం రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, రూ.10,500 ప్రత్యేక దర్శనం, ఆర్జిత సేవలు, స్లాట్ దర్శనం, సర్వదర్శనం అని పలు రకాలుగా ఉన్నాయి. భక్తుల్లో అత్యధికులు సామాన్యభక్తులు కావడం గమనార్హం.రద్దీ ఉన్న సమయాల్లో వైకుంఠం రెండో క్యూకాంప్లెక్స్‌లోనే దాదాపు 30 గంటలు స్వామి వారి దర్శనం కోసం వేచిచూడాల్సి వస్తోంది.స్లాట్ దర్శనం అంటే శ్రీనివాసం, విష్ణునివాసంలో ఆధార్ కార్డు ద్వారా దర్శన సమయం కేటాయిస్తారు. దీంతో రెండు, మూడు గంటల్లోనే దర్శనం పూర్తవుతుంది .అయితే ఈ టికెట్లు పరిమితమే. అలాగే అలిపిరి, శ్రీవారి మెట్టు నుంచి కాలి నడకన వచ్చే భక్తులకు గతంలో దివ్యదర్శనం అనే పేరుతో కొన్ని టికెట్లను కేటాయించేవారు. ఇందులో భాగంగా 2, 3 గంటల్లోనే దర్శనం పూర్తయ్యేది అయితే గత ప్రభుత్వం దీన్ని రద్దు చేసింది.

**ఐవీ సుబ్బారావు విధానం 'కంకణం'**

రెండు దశాబ్దాల కిందట ఐవీ సుబ్బారావు ఈవోగా ఉన్న సమయంలో కంకణాలను ప్రవేశపెట్టారు.దీని ప్రకారం



ప్రతి భక్తుడికి చేయికి రిస్ట్‌బాండ్ తరహాలో ఒక కంకణాన్ని ట్యాగ్ చేస్తారు. ఈ కంకణం వాటర్‌ప్రూఫ్ తరహాలో ఉంటుంది.దీన్ని తిరుపతిలోని అనేక కేంద్రాలతో పాటు రేణిగుంట తదితర ప్రాంతాల్లో వేసేవారు. ఈ విధానంతో మనకు కేటాయించిన సమయానికి వెళ్లి రెండు, మూడు గంటల్లో దర్శనం చేసుకొని రావచ్చు. ఛైర్మన్ బీఆర్ నాయుడు ఈ అంశాన్ని గతంలో ప్రస్తావించారు. దీన్నే తిరిగి అమలు చేసే అవకాశముంది.

**లఘుదర్శనంపై దృష్టిసారిస్తారా?**

30 సంవత్సరాల క్రితం వరకు సామాన్యభక్తుడు కూడా మూలవిరాట్‌ని అత్యంత సమీపంగా అంటే కులశేఖరపడి వరకు వెళ్లి దర్శనం చేసుకునేవారు. ప్రస్తుతం వీఐపీలు, రూ.10,500 దర్శనాలకు మాత్రమే అక్కడివరకు అనుమతినిస్తున్నారు.అనంతర కాలంలో లఘుదర్శనం అని ఏర్పాటు చేశారు. దీని ప్రకారం గరుడాళ్వార్ సన్నిధి నుంచి జయవిజయులను దాటి స్నపన మండపం వరకు వెళ్లి దర్శించుకునేవారు.తరువాత దీన్ని కూడా రద్దు చేసి గరుడాళ్వార్ సన్నిధి నుంచి దర్శనం కల్పిస్తున్నారు. దీనికి మహాలఘు దర్శనం అని పేరు పెట్టారు.కనీసం లఘు దర్శనం కల్పిస్తే దేవదేవుని సన్నిధిలో ప్రవేశించామన్న ఆనందానుభూతి కలుగుతుంది. దీన్ని పాలక మండలి పరిగణలోకి తీసుకోవాలని అచ్చుతుని భక్తులు కోరుతున్నారు.

# మణిపూర్‌లో నిరసనలు తీవ్రం.. మరో నలుగురు ఎమ్మెల్యేల ఇళ్లు ధ్వంసం



న్యూఢిల్లీ : మరోసారి మణిపూర్ రగిలిపోతుంది. ఇంఫాల్ లోయలోని కొన్ని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున హింస చెలరేగింది. ఈ క్రమంలో.. శనివారం ముగ్గురు భారతీయ జనతా పార్టీ, ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే నివాసాలపై దాడి చేశారు. ఆందోళన కారులు ముఖ్యమంత్రి ఎన్ బీరెన్ సింగ్ వ్యక్తిగత నివాసాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో.. పోలీసులు వారిని అడ్డుకున్నారు.నవంబర్ 11న భద్రతా దళాలు 10 మంది హ్మార్ పురుషులను చంపారు. ఆ ప్రదేశానికి సమీపంలోని నిర్వాసిత ప్రాంతం శిబిరం నుంచి ఆరుగురు మైతే జాతి వారు అదృశ్యమై చివరికి వారి మృతదేహాలు వెలుగులోకి వచ్చాయి. ఈ పరిణామాలు మణిపూర్‌లో తాజా హింసకు కారణమై య్యాయి.హతమైన వారిని భద్రతా దళాలు మిలిటెంట్లుగా అభి వర్ణించాయి. ఈ క్రమంలో.. శనివారం ఇంఫాల్ లోయలోని వివిధ ప్రాంతాలలో హింసాత్మక నిరసనలు చెలరేగాయి. ఫలితం గా నిరవధిక కర్ఫ్యూ విధించారు. ఇంటర్నెట్ సేవలు కూడా నిలిపివేశారు.

ఎమ్మెల్యేల నివాసాలపై దాడి:ఇంఫాల్ లోయలోని పలు ప్రాంతాల్లో ఆందోళనకారులు బీజేపీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఇళ్లకు నిప్పుపెట్టి ఆస్తులను ధ్వంసం చేశారు. నింగ్‌తౌఖోంగ్‌లో పబ్లిక్ వర్క్స్ మంత్రి గోవిందదాస్ కొంతౌజామ్, హ్యాంగ్లామ్ బజార్‌లో బీజేపీ ఎమ్మెల్యే వై రాధేశ్యామ్, తౌబాల్ జిల్లాలో బీజేపీ ఎమ్మెల్యే పవోనమ్ బ్రోజెన్, కాంగ్రెస్ ఎమ్మెల్యే లోకేశ్వర్ ఇళ్లకు నిప్పుపెట్టినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఈ సమయంలో ఎమ్మెల్యేలు, వారి కుటుంబ సభ్యులు ఇంట్లో లేకపోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.

ముఖ్యమంత్రి పూర్వీకుల ఇంటిపై దాడి: ఆందోళనకారులు ఇంఫాల్ తూర్పు జిల్లాలోని లువాంగ్‌సంగ్‌బామ్‌లో ఉన్న బీరెన్ సింగ్ పూర్వీకుల ఇంటిపై కూడా దాడికి ప్రయత్నించారు. అయితే, భద్రతా బలగాలు 100-200 మీటర్ల ముందుగానే వారిని అడ్డుకున్నాయి. దీంతో ఆందోళనకారులు సింగ్ ఇంటికి వెళ్లే ప్రధాన రహదారిపై టైర్లు తగలబెట్టి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు.

కర్ఫ్యూ, ఇంటర్నెట్ సేవలు నిలిపివేత:పరిస్థితిని అదుపు చేసేందుకు ఇంఫాల్ లోయలోని పలు జిల్లాల్లో పరిపాలన నిరవధిక కర్ఫ్యూ విధించింది. అలాగే ఇంటర్నెట్, మొబైల్ డేటా సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు. ముఖ్యమంత్రి అల్లుడు, బీజేపీ ఎమ్మెల్యే రాజ్ కుమార్ ఇమో సింగ్ సహా నేతల ఇళ్లపై దాడులు జరగడంతో ఏడు జిల్లాల్లో ఇంటర్నెట్ సేవలను అధికారులు నిలిపివేశారు.

ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవాలి:రాష్ట్రంలోని పౌర సమాజ సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న మణిపూర్ ఇంటిగ్రిటీ కోఆర్డినేషన్ కమిటీ ఉగ్రవాదులపై సైనిక చర్య తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఆరు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇటీవల మళ్లీ విధించిన ఆఫ్స్పా (సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం)ని తక్షణమే తొలగించాలని కమిటీ విజ్ఞప్తి చేసింది.

నిరసనలు, కాల్పుల ఘటనలు:జిరిబామ్ పట్టణంలో ఉగ్రవాదులు కనీసం రెండు చర్చిలు, మూడు ఇళ్లకు రాత్రిపూట నిప్పుపెట్టినట్లు అధికారులు తెలిపారు. అంతేకాకుండా.. ఇతర నిర్మాణాలను కాల్చడానికి ప్రయత్నం చేశారు. మణిపూర్‌లో ఈ హింస, ఉద్రిక్తత రాష్ట్ర పౌరులకు తీవ్రమైన సంక్షోభాన్ని సృష్టిస్తోంది. పరిపాలన, భద్రతా బలగాలు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ రాష్ట్రంలో శాంతిభద్రతలను పునరుద్ధరించేందుకు ఇంకా అనేక ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి.

# యాపిల్ తయారీకి మరో కంపెనీలో వాటా కొనుగోలు



న్యూఢిల్లీ : భారత్‌లో యాపిల్ ఉత్పత్తుల తయారీ భాగస్వామిగా ఉన్న పెగాట్రాన్‌లో 60 శాతం వాటాను టాటా గ్రూప్ కొనుగోలు చేసింది. ఇటీవల ఈమేరకు రెండు సంస్థల మధ్య ఒప్పందం జరిగింది.దాంతో భారత్‌లో యాపిల్ ఉత్పత్తులు తయారీ చేసే కంపెనీల్లో టాటా గ్రూప్ టాప్‌లో నిలిచిం ది.యాపిల్ సంస్థ చైనా భయట ఇతర దేశాల్లో తన ఉత్పత్తిని పెంచేలా ఇండియాలో ఉత్పాదకతను పెంచుతోంది. దానికోసం టాటా గ్రూప్, ఫాక్స్‌కాన్‌తోపాటు ఇతర కంపెనీలతో ఒప్పందం చేసుకుంది. కానీ కొన్ని చిన్న కంపెనీల్లోని మేజర్‌వా టాను ఇప్పటికే ఈ సంస్థలు కొనుగోలు చేశాయి. టాటా గ్రూప్ యాపి ల్ తయారీదారుగా ఉన్న విస్ట్రన్ కంపెనీను ఇప్పటికే కొనుగోలు చేసింది. తాజాగా పెగాట్రాన్ కంపెనీలో 60 శాతం వాటా కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకుంది. దాంతో స్థానికంగా యాపిల్ ఉత్పత్తులను తయారీని పెంచాలని నిర్ణయించింది.

**తయారీదారుగా ఉండడం తేలికైన విషయం కాదు..**

పెగాట్రాన్, టాటా గ్రూప్‌నకు చెందిన టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య గత ఏడాది కాలంగా ఈ ఒప్పందానికి సంబంధించిన చర్చలు జరుగుతున్నాయని కంపెనీ వర్గాలు తెలిపాయి. 'యాపిల్‌కు కాంట్రాక్ట్ తయారీదారుగా ఉండటం అంత తేలికైన విషయం కాదు. తయారీపై మార్జిన్‌లు కూడా అధికంగానే ఉంటాయి. యాపిల్ ఉత్పత్తుల అధునాతన స్వభావాన్ని పరిగణనలోకి తీసుకుని కంపెనీలు అత్యున్నత స్థాయితో ఉత్పత్తి చేపట్టాల్సి ఉంటుంది. నిత్యం నాణ్యతను ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది. గ్లోబల్ మార్కెట్‌లకు సరఫరా చేస్తున్నందున ఉత్పత్తిలో ఎటువంటి అంతరాయాలు ఉండకూడదు' అని యాపిల్ ఉత్పత్తుల తయారీ వ్యవస్థలో భాగమైన ఒక ఉన్నత అధికారి తెలిపారు. టాటా గ్రూప్ ఇప్పటికే భారత్‌లో ఐఫోన్ 16 తయారీని ప్రారంభించింది.

**పెగాట్రాన్ ఉత్పత్తి సామర్థ్యం**

పెగాట్రాన్ గత సంవత్సరం దేశీయంగా వినియోగిస్తున్న ఐఫోన్ ఉత్పత్తిలో సుమారు 10 శాతం సహకారం అందిం చింది.ఈ కంపెనీకి తమిళనాడులో తయారీ యూనిట్ ఉంది. ఇందులో దాదాపు 10,000 మంది కార్మికులు పనిచేస్తు న్నారని అధికారులు తెలిపారు. ఈ యూనిట్ ఏటా ఐదు మిలి యన్ల ఐఫోన్‌లనుఉత్పత్తిచేయగల సామర్థ్యాన్ని కలిగి ఉందని చెప్పారు.

# దీపావళికి మనోళ్ళు చుక్కలు చూపించారు.. రోజుకు లక్షకు పైనే.. భారతీయుల రేంజ్ అంటే ఇది..



అమరావతి : దేశంలో దసరా, దీపావళి సెలబ్రేషన్స్ మాములుగా ఉండవు. ఈ టైంలో చాలా మంది కొత్త వాహ నాలు కొనుగోలు చేయడం ద్వారా తమకు కలిసి వస్తుందని భావిస్తారు. అందుకే ఇతర సీజన్‌తో పోలిస్తే, అక్టోబర్, నవంబర్ టైంలో వాహనాల విక్రయాలు ఎక్కువగా నమోదవుతుంటాయి. ముఖ్యంగా దీపావళికి దేశంలో అధిక సంఖ్యలో వాహనాలు అమ్ముడుపోతుంటాయి. ఈ ధోరణి ప్రతి ఏటా పెరుగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో ఆటోమొబైల్ కంపెనీలు తమ వాహనాలపై భారీ మొత్తంలో తగ్గింపులు, డిస్కౌంట్‌లు, క్యాష్‌బ్యాక్‌లను అందించడం వంటి కారణాల వలన ఈ అక్టోబర్ నెలలో విక్రయాలు గత ఏడాది కంటే అధికంగా నమోదయ్యాయి. 2023 ఏడాది కంటే కూడా 2024లో ఎక్కువ మంది తమకు నచ్చిన వాహనాలు కొనుగోలు చేసి తమ ఇంటికి తీసుకెళ్లారు.ఇటీవల అక్టోబర్ టైంలో జరిగిన వాహన అమ్మకాల గణంకాలను తాజాగా ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ ఫెడరేషన్ వెల్లడించింది. దీని ప్రకారం చూసినట్లయితే 2024 దీపావళి సందర్భంగా, భారీ మొత్తంలో కొత్త వాహనాలు అమ్ముడుపోయాయి. అనగా, 42 రోజుల్లో దేశవ్యాప్తంగా 43 లక్షల కొత్త వాహనాల విక్రయాలు జరిగాయి. ఈ రేంజ్‌లో అమ్మకాలు నమోదు కావడం అంటే సాధారణ విషయం కాదు.కచ్చితమైన డేటా ప్రకారం, అక్టోబర్ 3 నుంచి నవంబర్ 13వ వరకు దేశంలో 42,88,248 యూనిట్ల వాహనాలు అమ్ముడుపోయాయి. కొద్ది రోజుల్లోనే ఈ సంఖ్యలో వాహనాల కొనుగోళ్లు నమోదు కావడంతో దేశీయ ఆటోమొబైల్ రంగం ఆశ్చర్యపోయింది. ఇది గత ఏడాది దీపావళి సమయంలో అక్టోబర్ 15 నుంచి అక్టోబర్ 25 వరకు జరిగిన 38.37 లక్షల యూనిట్ల అమ్మకాలతో పోలిస్తే 11.76 శాతం ఎక్కువ.టూవీలర్స్, త్రీ వీలర్లు, వాణిజ్య వాహనాలు, ప్యాసింజర్ వాహనాలు వంటి అన్ని విభాగాల్లో కూడా మెరుగైన వృద్ధి కనబడింది. అయితే ట్రాక్టర్ సెగ్మెంట్‌లో మాత్రం విక్రయాలు గత ఏడాది కంటే తగ్గాయి. ప్రధానంగా టూవీలర్ వాహనాలు మాత్రం అధికంగా అమ్ముడుపోయాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి డిమాండ్ ఎక్కువగా రావడంతో టూ వీలర్ సేల్స్ గత ఏడాది కంటే 11.76 శాతం ఎక్కువ పెరిగాయి.2023 అక్టోబర్ దీపావళి సమయంలో టూవీలర్ సేల్స్ 29,10,141 యూనిట్లుగా ఉండగా, ఈ ఏడాది ఇదే సమయంలో 33,11,325 యూనిట్ల వరకు అమ్మకాలు జరిగినట్లు ఇండస్ట్రీ బాడీ ఫాడా తెలిపింది. ఈ లెక్కన 33 లక్షల మందికిపైగా కొత్తగా టూవీలర్స్‌ను తమ ఇంటికి తీసుకెళ్లారు. వీటి తరువాత ప్యాసింజర్ కార్ల విభాగం కూడా ఎక్కువ అమ్మకాలు నమోదు చేసింది.ఈ అక్టోబర్ నెలలో 6,03,009 యూనిట్ల ప్యాసింజర్ కార్ల విక్రయాలు జరగ్గా, గత ఏడాది ఇదే నెలలో ఇది 5,63,059 యూనిట్లుగా నమోదైంది. కార్ల అమ్మకాల తర్వాత త్రీవీలర్ విక్రయాలు మూడో స్థానంలో నిలిచాయి. ఈ ఏడాది ఇవి 1,59,960 యూనిట్ల వరకు అమ్ముడు కాగా, గత ఏడాది ఇది 1,49,764 యూనిట్లుగా నమోదైంది.వాణిజ్య వాహనాల విక్రయానికి వస్తే, ఈ విభాగం అమ్మకాలు అక్టోబర్ నెలలో మెరుగ్గా ఉన్నాయి. 2023 లో ఇదే నెలలో అమ్మకాలు 1,27,436 యూనిట్ల నుంచి ఇప్పుడు 1,28,738 యూనిట్లకు పెరిగినట్లు ఫాడా వెల్లడించిన డేటా తేలింది. దాదాపు అన్ని విభాగాలు విక్రయాలు గణనీయంగా పెరిగినప్పటికీ వ్యవసాయం రంగంలో కీలకమైన ట్రాక్టర్ అమ్మకాలు మాత్రం భారీగా తగ్గాయి.ట్రాక్టర్ విక్రయాలు గత ఏడాది అక్టోబర్‌లో 86,640 యూనిట్లుగా నమోదు కాగా, ఈ సారి మాత్రం 1.64 శాతం తగ్గి 85,216 యూనిట్లకు చేరుకున్నట్లు డేటాలో వెల్లడైంది. మొత్తంగా చూసినట్లయితే ఈ దీపావళి ఆటోమొబైల్ తయారీ దారులకు గుర్తుండిపోయే విధంగా నిలిచింది. రానున్న రోజుల్లో కూడా ఇదే అమ్మకాల ధోరణి కొనసాగే అవకాశం ఉందని ఫాడా ప్రతినిధులు పేర్కొన్నారు.

# విశాఖ టు కర్నూలు.. మధ్యలో హైదరాబాద్.. హైస్పీడ్ కారిడార్‌తో బోలెడు లాభాలు



అమరావతి : తెలుగు రాష్ట్రాల ప్రజలకు గుడ్ న్యూస్. త్వరలో సెమీ హై స్పీడ్ రైళ్లు అందుబాటులోకి రానున్నాయి. గంటకు 220 కిలోమీటర్ల వేగంతో నడిచే రైళ్ల రాకపోకలకు వీలుగా ప్రత్యేక కారిడార్ ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడనున్నాయి.సగటున ప్రతి 49 కిలోమీటర్లకు ఒక స్టేషన్ మాత్రమే ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. శంషాబాద్ %-% విశాఖపట్నం, వయా సూర్యపేట మీదుగా కర్నూలుకు కలుపుతూ ఈ హై స్పీడ్ రైలు క్యారిడార్ నిర్మితం కానుంది. ఈ కీలక ప్రాజెక్టు ప్రాథమిక అంచనా వ్యయంగ 21 వేల కోట్ల రూపాయలు. ఏపీలో విశాఖపట్నం, కర్నూలు నగరాలను అనుసంధానం చేయాలన్న ప్రతిపాదన చాలా రోజుల నుంచి ఉంది. అందుకే సూర్యాపేటను కేంద్రంగా ప్రతిపాదించారు. అటు శంషాబాద్, ఇటు విశాఖ, వయా సూర్యపేట మీదుగా కర్నూలుకు ఈ సెమీ హై స్పీడ్ క్యారీడర్ నిర్మాణం చేపట్టడానికి డిసైడ్ అయ్యారు. నవంబర్లో రైల్వే బోర్డుకు సమర్పించే ప్రిలిమినరీ ఇంజనీరింగ్ ట్రాఫిక్ సర్వే నివేదికతో.. ఈ ప్రాజెక్టుకు ఖర్చు చేసే నిధులపై స్పష్టత రానుంది. అటు తరువాతే డిపిఆర్ రూపొందించేందుకు తుది సర్వే నిర్వహిస్తారు. దీంతో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుంది.

రవాణా సులభతరం : ఈ ప్రాజెక్టు నిర్మాణంతో తెలుగు రాష్ట్రాల మధ్య రవాణా మరింత సులభతరం కానుంది.తక్కువ సమయంలోనే తెలంగాణ నుంచి ఏపీకి ప్రజలు చేరుకోవచ్చు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రజలకు ఈ ప్రాజెక్టు ఎంతగానో ఉపయోగపడుతుంది. సగటున ప్రతి 49 కిలోమీటర్లకు ఒక స్టేషన్ మాత్రమే ప్రతిపాదించారు. కానీ తుని రాజమండ్రి రైల్వే స్టేషన్ల మధ్య 88 కిలోమీటర్ల దూరం ఉండనుంది. అతి తక్కువ సమయంలో ప్రయాణికులకు గమ్యానికి చేర్చడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. శంషాబాద్ విశాఖపట్నం మార్గంలో మొత్తం 12 స్టేష న్లను ప్రతిపాదించారు. అందులో తెలంగాణలో ఆరు స్టేషన్లు, ఏపీలో ఆరు స్టేషన్లు ఉండనున్నాయి. మధ్యలో సూర్యాపేట నుంచి కర్నూలుకు వేరే మార్గం నిర్మించాలన్నది ఈ ప్రాజెక్టులో భాగమే. ఈ రూట్లో వచ్చే ఎనిమిది అదనపు స్టేషన్లలో కర్నూలు మినహా మిగిలిన అన్ని తెలంగాణలో ఉండనున్నాయి.

ఎంతో ప్రయోజనం : శంషాబాద్ విశాఖపట్నం సెమీ హై స్పీడ్ క్యారీడార్ నిర్మాణంతో రెండు రాష్ట్రాల ప్రజల రవాణా కష్టాలు తీరనున్నాయి. రైల్వే శాఖలో అనేక సంస్కరణలను తీసుకొచ్చారు. కానీ ఇంకా లోటు కనిపిస్తోంది. అందుకే ఇప్పుడు సెమీ హై స్పీడ్ క్యారీడర్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఉభయ తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి అవకాశం కలుగుతుందని కేంద్రం అంచనా వేస్తోంది. వీలైనంత త్వరగా ఈ ప్రాజెక్టు పట్టాలెక్కించాలని భావిస్తోంది.

# జగన్ అస్త్రంతోనే కూటమి రివర్స్ ఉచ్చు- హిస్టరీ రిపీట్..!



అమరావతి :ఏపీలో రాజకీయం ఆసక్తి కరంగా మారు తోంది. వైసీపీ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వ్యూహాత్మ కంగా అడుగులు వేస్తోంది. రాజకీయంగా జగన్ ను ఫిక్స్ చేయటం కోసం పావులు కదుపుతోంది.గత ప్రభుత్వ హయాం లో అక్ర మాలు చోటు చేసుకున్నాయని పదే పదే ఆరోపిస్తున్న కూట మి నేతలు ఇప్పుడు జగన్ లక్ష్యంగా కసరత్తు చేస్తున్నారు. అం దులో భాగంగా జగన్ హయాంలో జరిగిన భూ లావాదేవీల పైన ఫోకస్ చేసింది. జగన్ అండ్ టీం కు ఉచ్చు బిగిసేలా ఆ ధారాల సేకరణలో ప్రభుత్వం నిమగ్నమైనట్లు స్పష్టం అవుతోంది.

**అసెంబ్లీ వేదికగా**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నాడు విపక్షంలో ఉన్న చేసిన ఆరోపణలు విచారణకు సిద్దమైంది. ఇప్పటికే ఇసుక, లిక్కర్ అంశాల పైన సీఐడీ విచారణ చేస్తోంది. అదే విధంగా సోషల్ మీడియా పోస్టులు, వైసీపీ నేతల పై గతంలో ఉన్న అభియోగాల పైన విచారణ కొనసాగుతోంది. పలువురిని ఇప్పటికే అరెస్ట్ చేసారు. లిక్కర్, ఇసుక అక్రమాల పైన సీఐడీ వైసీపీ నేతలు పలువురిని అరెస్ట్ చేసింది. ఇక, ఇప్పుడు జగన్ హయాంలో రాష్ట్రంలో పెద్ద ఎత్తున భూ అక్రమాలు జరిగినట్లు కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. దీనికి సంబంధించి తాజాగా మంత్రి అనగాని సత్య ప్రసాద్ అసెంబ్లీ వేదికగా కీలక ప్రకటన చేసారు.

**మంత్రి ప్రకటనతో**

ఏపీ అసెంబ్లీ అసైన్డ్ భూముల వ్యవహారం పైన చర్చ జరిగింది. ఈ సమయంలో మంత్రి అనగాని కీలక అంశాలను ప్రస్తావించారు. 25వేల ఎకరాల అసైన్డ్ భూమలు గత ప్రభుత్వ హయాంలో రిజిస్ట్రేషన్ జరిగిందని చెప్పుకొచ్చారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగినట్టు నిర్ధారణ అయిందని మంత్రి వెల్లడించారు. ఆ రిజిస్ట్రేషన్లు ఆపేయమని ఆదేశాలు ఇవ్వటంతో పాటుగా రీ సర్వే చేయాలని నిర్ణయించామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలోని తప్పులను సరి దిద్దు తామని చెప్పుకొచ్చారు. త్వరలో ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ తెస్తామని మంత్రి అనగాని శాసనసభలో ప్రకటించారు.

**నాడు జగన్ ..నేడు కూటమి**

గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో విపక్ష నేతగా జగన్ ఇదే తరహాలో అమరావతి భూముల విషయంలో ఇన్ సైడర్ ట్రేడింగ్ జరిగిందని ఆరోపించారు. జగన్ నాటి ఆరోపణల పైన శాసనసభలో పెద్ద వివాదమే చెలరేగింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇన్ సైడర్ ట్రేడింగ్ ఆరోపణల పైన మంత్రుల కమిటీతో పాటుగా సీఐడీ విచారణ జరిగింది. పలువురు టీడీపీ మాజీ మంత్రుల పైన అభియోగాలు నమోదు చేసింది. ఇక, ఇప్పుడు కూటమి ప్రభుత్వం సైతం అదే ఇన్ సైడర్ ట్రేడింగ్ అస్త్రంతో జగన్ లక్ష్యంగా ఉచ్చు బిగిస్తోంది. ప్రజా దర్బార్ లో వస్తున్న వరుస ఫిర్యాదులు.. అధికారుల నివేదికల ఆధారంగా భూముల వ్యవహారంలో అక్రమాలు.. ఆధారా ల పైన ఫోకస్ చేసింది. ఈ అంశంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపుకు కారణంగా మారే అవకాశం కనిపిస్తోంది.

# “ప్రజా సమస్యల పరిష్కార వేదిక”కు 33 మంది ఫిర్యాదిదారులు....

**దివ్యాంగుని వద్దకు స్వయంగా వెళ్లి సమస్యను అడిగి తెలుసుకున్న ఎస్పీ**



రాయల్ జర్నలిజం (బాపట్ల) నవంబర్ 18: ఫిర్యాదిదారుల సమస్యలను సంతృప్తికర రీతిలో పరిష్కరించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో “ప్రజా సమస్యల పరిష్కార వేదిక” (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల ఫిర్యాదులను ఎస్పీ స్వయంగా స్వీకరించి, వారితో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



ఫిర్యాదిదారుల సమస్యలను చట్టపరిధిలో విచారించి సంతృప్తికార రీతిలో పరిష్కరించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఇతర సమస్యలపై 33 మంది ఫిర్యాదీదారులు వారి సమస్యలను ఎస్పీకి విన్నవించుకున్నారు. తన సమస్య చెప్పుకోవడానికి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి వచ్చిన దివ్యంగుడు నడవడానికి ఇబ్బంది పడుతుండడంతో సిబ్బంది ద్వారా విషయం తెలుసుకున్న ఎస్పీ స్వయంగా అతడి వద్దకు వెళ్ళి అతడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. సమస్యను వేగవంతంగా చట్టపరిధిలో పరిష్కరించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, పి.జి.ఆర్.ఎస్ ఇంచార్జ్ సీఐ శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

